# అమృత గానం

రంగధామ్

"మీకొక మంచి వార్త చెప్పనా?" అంది జానకి నన్ను ఊరించే కళ్లతోనూ, బుగ్గలతోనూ. తెల్లని చీరా, తెల్లని రవికే వేసుకుని; తలంటి పోసుకున్న జడను పాయలుగా తీసి అల్లి, నుదుట నిలువు బొట్టూ, కళ్లకి కాటుకతో ప్రత్యక్షమైన జానకి స్వరూపమే ఊరించేట్టుగా వుంది నన్ను. కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న నేను, ఆమె రూపం చూసి, ఆమె నడుము నా కెంత దూరంలో వుందా, అని ఆలోచించ సాగాను–గబుక్కున దగ్గరకు లాక్కునే వుద్దేశంతో.

"అయితే అక్కర్లేదా?" అంది చిరుకోపం నటిస్తూ, నేను మాట్లాడక పోవడం చూసి. ఎందు కక్కరలేదూ? ఆమె తెచ్చిన వార్తా కావాలి, ఆమే కావాలి; చెయ్యి పట్టుకో బోయాను.

"ఉండండి, ఆవిడ వచ్చింది".

గాభరాపడ్డాను. ఎవరో వచ్చారట. ఎంత భార్య అయినా, పరాయి వాళ్ల ముందర కాస్త ఎడంగా వుండాలనే ఉద్దేశంతో చెయ్యి వెనక్కు లాక్కుని, ఎవరూ? ఏరీ? అన్నట్లు కళ్లూ, కనుబొమలూ ఎగరేశాను. ఫక్కుని నవ్వింది.

"ఇక్కడికి కాదు. కోవెలలోకి".

బ్రతికాం. ఇంతకీ ఎవరో ఆవిడ? నేను ప్రశ్నార్థకంగా మొహం పెట్టే సరికి మా ఆవిడే చెప్పింది. "పాట పాడే ఆమె".

అప్పుడు గుర్తు కొచ్చింది. "మీనాక్షమ్మ గారా?" అని అడిగాను. అవు నంది జానకి; ఆమెను సాయంకాలం మన యింటికి రమ్మని ఆహ్వానించా నని కూడా చెప్పింది. అంత మంచిపని చేసినందుకు జానకికి ఎన్నో ప్రెజం ట్లిచ్చి, కందిన బుగ్గలతో ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయాక మీనాక్షమ్మ గురించి ఆలోచించసాగాను.

మీనాక్షమ్మ గురించి వినడమే కాని, ప్రత్యక్షంగా ఆమెను చూడలేదు. మేము ఆవూరు వచ్చి సుమారు ఎనిమిదినెల లయింది. నాకూ, జానకికీ కూడా సంగీతం అంటే విపరీతమైన యిష్టం. ఒకనాడు మా ప్రక్కింటివాళ్లు, ఏవో మాటల సందర్భంలో మీనాక్షమ్మ గురించి చెప్పారు. ఆనాడు సంగీతం గురించి చర్చించుకుంటూ, కొన్ని కీర్తనల్ని కొందరు చాలాబాగా పాడతా రనీ, అవి వినాలంటే, వారి నోటివెంటనే వినాలనీ అనుకున్నాము. నా చిన్నప్పుడు మా అమ్మ "ఆరగింపవే, పాలారగింపవే" అన్న పాట పాడేదనీ, ఆమె చనిపోయాక మళ్లీ ఆపాట అంత బాగా పాడేవారిని చూడ లేదనీ, విన లేదనీ అన్నాను.

నా మాట విని మా ప్రక్కింటి రామావతారంగారు, "మీరు చెప్పిన పాట, బాగా పాడగల వ్యక్తి ఒకామె వుంది. ఆమె గొప్ప సంగీత విద్వాంసురాలు. సుమారు ఇరవై అయిదేళ్ల క్రితం ఈ ప్రాంతాలలో అనేక పాట కచ్చేరీలు చేసి మంచి కీర్తి గడించింది, ఇప్పు డిక్కడ లేదు గాని, ఎప్పుడైనా ఈవూరు వస్తూంటుంది" అన్నారు.

నేను చాలా ఆత్రుతతో, "అయితే ఆమె ఏ మద్రాసులోనో 'సెటిల్' అయి మంచి పేరు ప్రఖ్యాతులు గణిస్తూ వుండి వుంటుంది. ఆమె పేరు?" అని అడిగాను ఒక ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలి పేరు వింటా ననే ఆశతో.

"అబ్బే! ఆమె నెవరూ ఎరుగరు. నిజానికి ఆమె ఎంతో ఔన్నత్యాన్నీ పొందగలిగిన ప్రతిభావంతురాలు. కాని ఆమె జీవితం వక్ర గతి ననుసరించడం వల్ల ఆమె అధోగతి పాలయింది" అన్నారు. నా కాయన మాటలు బోధపడలే దన్నాను.

రామావతారంగారు సవిస్తరంగా చెప్ప నారంభించారు. "ఇది ముప్పై ఏళ్లకు పూర్వం సంగతి. ఆ రోజులలో లక్ష్మణరావు గారని, ఈ వూరిలో ఒక లక్షలాది ఆస్తి సంపదలు కల వ్యక్తి వుండేవారు. ఆయన కళాభిమాని. అందులో సంగీతం అంటే ఆయనకు ఒళ్లు తెలియదు. ఎంత మంది గాయకులను పోషించారో లెక్కలేదు. ఒక గాన కళాశాలను కూడా నడిపించేవారు. ఉత్సాహవంతులైన యువతీ యువకుల నెందరినో చేరదీసి, సంగీతం నేర్పించి, వారిచే పాటకచ్చేరీలు చేయించి ఆనందించే వారు. ఆయనకు పురుష సంతానం లేదు. ఇద్దరమ్మాయిలు కలిగారు. వారిని

చిన్నప్పటి నుండీ ఈ విద్యలో పారంగతుల్ని చెయ్యడానికి ప్రయత్నించారు. ఆ యిద్దరు పిల్లలూ సుమారు 10, 11 సంవత్సరాల ప్రాయంలో అద్భుతంగా పాటకచ్చేరీలు చేస్తూండేవారు. పెద్దపిల్ల పేరు విశాలాక్షి. రెండవపిల్ల పేరు. మీనాక్షి. సుమారు 11 సంవత్సరాల ప్రాయంలో ఒకనాడు హఠాత్తుగా మీనాక్షి మరణించింది. లక్ష్మణ రావుగారు ఆ దెబ్బతో కృంగిపోయారు. కొన్ని నెలల వరకూ వారింట్లో సంగీతం విన్పించలేదు. ఇంతలో శ్రీరామనవమి



వచ్చింది. ఏటా రామ నవమి వుత్సవాలు, చక్కని సంగీతకచ్చేరీలు ఏర్పాటుచేసి, పెద్ద పందిళ్లలో అన్నదానాలతో సహా భారీ ఎత్తున జరుపుతూండేవారు. ఆయన ఆ ఏడాది పుత్రికావియోగ దుఃఖభారంతో ఉత్సవాలు జరిపించరేమోనని అందరూ అనుకున్నారు. కాని ఆయన ఇంటి ముందర తయారైన పందిళ్లను చూడగానే అందరి అపోహ తొలగిపోయింది".

"ప్రతి ఏటా ఆయన జరిపే రామనవమి ఉత్సవాలలో మొదటి రోజు ఆయన

కూతుళ్లిద్దరూ పాడడం ఆచారం. ఆ ఏడాది ఆవాడుక పోతుందని అందరూ విచారించారు. ఆ సమయంలో, ఆయన నడిపిస్తున్న గాన కళాశాలలో మీనాక్షి అనే పేరుగల పదకొండేళ్ల అనాథబాలిక సంగీతం నేర్చుకుంటోందనీ, చాలా బాగా పాడుతుందనీ, లక్ష్మణరావుగారికి తెలిసింది. ఆ పిల్లను పిలిపించి, తన పెద్ద కూతురి ప్రక్కన కూచోబెట్టి, ఇద్దరిచేతా సంగీత కచ్చేరీ చేయించారు. విన్నవారందరూ అద్భుతంగా వుందని మెచ్చుకున్నారు. ఆనాటినుంచీ ఆ మీనాక్షి అనే అనాథబాలికను తమ స్వంత పుత్రికలా చూసుకోనారంభించారు. ఆ యిద్దరమ్మాయిలూ స్వంత అక్కచెల్లెళ్ల లాగే మెలుగుతూ సుమారు పదేళ్లపాటు అనేక పాటకచ్చేరీలు చేసి, అసంఖ్యాకమైన బహుమానాల్ని పొందారు. ఇద్దరిలోనూ, మీనాక్షి పాట మిన్నగా వుండేదని అందరూ అనేవారు. ఆమె కొన్ని కీర్తనల్ని విశేష ప్రతిభతో పాడేది. సుమారు ఆమెకు ఇరవై ఏళ్లు దాటాక, ఒకనాడు ఆమె హఠాత్తుగా మాయమయింది. ఆమెతోబాటు, గాన కళాశాలలో విద్యనేర్పే ఒక యువకుడుకూడా అదృశ్యుడయ్యాడు. మరునాడు లక్ష్మణరావుగారు ఎంత వెతికించినా వారిద్దరూ కన్పించలేదు. ఆమె దుశ్శీల అని అంతవరకెవరూ వూహించలేదు. అందువల్ల అందరికీ ఇది పెద్దదెబ్బలా బాధించింది. తరువాత కొద్ది రోజులకు తన పెద్దకూతురు విశాలాక్షి వివాహం జరిపించి, ఆమెనత్తవారింటికి పంపేశారు లక్ష్మణరావుగారు. ఆనాటినుంచీ రామనవమి ఉత్సవాల ఆడంబరం తగ్గింది. మరి పదేళ్ల తరువాత లక్ష్మరావుగారు చనిపోయారు. ఆయన చనిపోయాక మీనాక్షి మళ్లీ ఈవూళ్ళో కన్పించింది. కాషాయరంగు బట్టలు కట్టుకొని యోగినిలా తయారయింది. ఎవరూ ఆమెను పల్కరించలేదు. ఆమె ఎవరితోనూ మాట్లాడలేదు. రామమందిరంలో ఒకగదిలో బసచేసింది. నవమి వుత్సవాలు పూర్తవగానే వెళ్ళిపోయింది. బహుశా తన పాపపంకిలమైన జీవిత గతిని మార్చుకోడానికి ప్రయత్నిస్తోందేమో? ఆమె ఎక్కడ వుందో, ఏంచేస్తుందో ఎవరికీ తెలియదు. కాని ఏటా నవమి వుత్సవాలకు మాత్రం వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళిపోతుంది" అని ముగించారు రామావతారంగారు.

ఆమెగురించి విని నేను కొంచెం బాధపడ్డాను. ఆకాస్త మచ్చా లేకపోతే ఎంత గొప్పదయ్యేదో! ''అయితే ఆమెపాట చాలా గొప్పదంటారా?" అన్నాను. రామావతారంగారు, "అందుకు సందేహంలేదు. ఆమె ఈసారి ఈవూరొస్తే మీరే విందురుగాని" అన్నారు. అప్పటినుంచీ నేనూ, జానకీకూడా ఆమెకోసం ఎదురు చూడసాగాం.

రామనవమి రావడంతో మాకోరిక సఫలమైంది. ఆమె తన అలవాటు ప్రకారం ఆవూరు వచ్చి, రామ మందిరములో బస చేసింది. జానకికి ఆ విషయం తెలిసి, వెళ్ళి ఆమెను మాయింటికి ఆహ్వానించింది. ఆమె అసలలా ఎవరింటికీ వెళ్ళదట. కానీ జానకిని చూడగానే ఆమెకెందుకో వాత్సల్యం కలిగిందట. జానకికి పద్దెనిమిదేళ్లుంటాయి. నాకు ఇరవై రెండు. మాయిద్దరికీ వివాహమై రెండేళ్ళయింది. మా యిద్దరి యెడలా కూడా ఆమెకు చాలా అభిమానం కలిగిందని తరువాత నేను గ్రహించాను.

ఆ రోజు సాయంకాలం ఆమె మాయింటికి వచ్చింది. ఆమె పచ్చగా, బొద్దుగా, ఠీవిగా వుంటుంది. తల నెరిసింది. కాషాయరంగు బట్టలు కట్టుకొన్నా ఒక మహరాణీలా వుంది. నేనామెను చూడగానే నమస్కరించాను. ఆమె ఆశీర్వదించింది. కొద్దిసేపు పరిచయ సంభాషణ లయ్యాయి. నేనూ, జానకీ ఆమె సంభాషణలో ఎంతో ఆప్యాయత ననుభవించాం. నన్ను "బాబూ" అనీ, జానకిని, "పాపా" అని పిలుస్తూ ఆమె ఎన్నో కబుర్లు చెప్పింది. ఆమె పాట వినాలనీ, ముఖ్యంగా "ఆరగింపవే......" అన్నపాట వినాలనీ ఎదురు చూస్తున్నామని చెప్పాను. ఆమె మందహాసం చేసింది.

తోడిరాగం ఆమె ఆలపిస్తూంటే, చుట్టూ వున్న వాతావరణమంతా ఒక చైతన్యంతోనూ ఆనందంతోనూ నిండిపోయింది. భక్తి పూరిత హృదయంతో, పరిపూర్ణ ప్రేమ భావనతో,"ఆరగింపవే,పాలారగింపవే..." అని ఆమె, తన యెదుట రాముణ్ణి భావించుకొని,ఆయనను కోరుతున్నట్లుపాడుతూంటే, విన్నవారికి రసస్ఫూర్తీ, భావానుభూతీ కలుగసాగింది. అదొక అపూర్వ గానం; అది నాదమో, అమృత ప్రవాహమో తెలియని మృదు మధుర స్వర సమ్మేళనం. 'సారమైన దివ్యాన్నము, షడ్రసయుత భక్షణములు', తనివితీరా తినమని ఆ రఘువీరుణ్ణి కోరే ఆగీతం వింటూంటే, తనువు పులకరించి, జన్మ సార్థకమైన దనిపించింది. మీనాక్షమ్మ పాట చాలించిన చాలా సేపటి వరకూ, ముగ్గురం ఆర్ద్రనయనాలతో, ద్రవీభూతమైన హృదయాలతో మౌనంగా వుండిపోయాం.

ఆమె ప్రతిరోజూ మాయింటికి రాసాగింది. లోకం ఆమెనుగురించి ఏమనుకున్నా, ఆమె మాకు సంగీతంద్వారా చాలా సన్నిహితురాలయింది. నాకూ, మా జానకికీ కూడా కొంచెం పాడడం వచ్చు. ఆమె వచ్చినప్పుడల్లా మా చేతకూడా పాడించేది. మాకు ఆమెను చూస్తే ఎందుకో చాలా అభిమానంగా వుండేది. ఆమె వున్నంత సేపూ ఆమెలో ఎదో ఒక ఆకర్షణ మాలో ఆమెయందెంతో సద్భావం కలిగించేది.


ఆమె వెళ్ళిపోయాక ఆమె గురించి పైవాళ్ళెవరో ఒకరు ఎదో ఒక మాట చెడ్డగా అనేవారు. అది విన్నప్పుడు నా మనస్సు కృంగిపోయేది. ఇలా రెండేళ్ళు గడిచాయి.

ఆమె ఎన్ని పాపాలు చేసినా, ఆమె మనసులో మాత్రం భగవంతుడంటే విశ్వాసం వుందని గ్రహించాను. తనువు పాపపంకిలమైనా, ఆమెకళ ఎన్నటికైనా ఆమెకు ఉత్తమ గతి కల్పించి తీరుతుందని ఆశించాను. కాని

నాలో ఒక ప్రశ్న అనేక సార్లు ఉత్పన్నమై, జవాబు దొరకక, మనసును బాధిస్తూండేది. ఈమె తన శీలాన్ని పోగొట్టుకొని పతిత కావలసినపరిస్థితి ఎందుకువచ్చింది? హాయిగా ఒక పురుషుణ్ణి కోరుకొని, వివాహం జరుప మని కోరి వుంటే లక్ష్మణరావుగారు తప్ప కుండా జరిపే వారే! అలా ఎందుకు చెయ్య లేకపోయిందో నా కర్థం కాలేదు.

మూడో ఏడు శ్రీరామ నవమి వుత్స వాలకు ఆమె వచ్చినప్పుడు, కోవెలలో కాక మా యింట్లోనే ఆమె బస ఏర్పాటు చేశాను.





పోలికలు

రోజూ పాటలతో, పూజలతో మా యిల్లు చాలా కోలాహలంగా వుంది. రాత్రి పాటలయ్యాక మేము ముగ్గురం ఏదో లోకాభిరామాయణం మాట్లాడుతూండేవాళ్ళం.

ఒక నాటి రాత్రి, సంభాషణలో, నా మనస్సులో వున్న ప్రశ్న అప్రయత్నంగా బయటికి వచ్చేసింది. నేనామెను, సూటిగా కాక, అదేభావం స్ఫురించేట్టుగా, "మీరు ఇంత తెలిసినవారుకదా, ఒకప్పుడు బలహీనతకు ఎందుకు లొంగిపోయారో నాకర్థం కావటంలేదు" అన్నాను.

ఆమె నా భావంగ్రహించి, నేను లొంగింది నాలోని బలహీనతకు గాదు. పరిస్థితులకూ, కృతజ్ఞతకూ లొంగాను" అంది.

"అంటే?" అన్నాను అర్థంకాక.

"నన్ను కొంత కాలం పెంచి, అభివృద్ధిలోకి తెచ్చిన వ్యక్తికి కృతజ్ఞత ప్రకటించడం కోసం అలా చేశాను".

"కాని లోకం, మీరు విశ్వాస ఘాతకులంటోంది. మీ మాటలు నాకు బోధపడేట్టు చెప్పండి'' అని అడిగాను.

ఆమె చెప్పింది. "నే నొక అనాథను. నన్ను లక్ష్మణరావుగారు ఆదరించారు. సంగీతం చెప్పించి, నలుగురిలో ఘనంగా ప్రశంసలు పొందేట్లు చేశారు. అటువంటి ఆయన కొక విపత్తు వచ్చింది. అ దేమిటో ఎవరికీ పై వారికి తెలియదు. ఆయన కూతురు విశాలాక్షికి హఠాత్తుగా పెళ్ళి చెయ్యాలసి వచ్చింది. సంబంధం కుదిరింది. వారం రోజుల్లో ముహూర్తం కూడా కుదిరింది. కాని పెళ్ళికొడుకు నన్ను చూసి, నన్నేగాని, విశాలాక్షిని వివాహం చేసుకో నని పట్టుబట్టాడు. అప్పు డాయన కేమీతోచక, నేనొక దుశ్శీల ననీ, ఒక యువకునితో ప్రణయకలాపాలను సాగిస్తున్నా ననీ లక్ష్మణరావుగారు ఆ పెళ్ళికొడుకుకి చెప్పి, అతనికి నా మీద మనసు విరిగిపోయేట్లు చేశారు. అంతే కాక ఆ రాత్రే నావద్దకు వచ్చి జరిగినదంతా చెప్పి, నాకు కొంత డబ్బిచ్చి, తన మాటల్ని రుజువు చేసేందుకు కొన్నాళ్ళ వరకు ఎక్కడికైనా వెళ్ళిపొమ్మన్నారు. అప్పటికే విశాలాక్షి పరిస్థితి నాకు తెలుసు. ఆమె ఒక దుర్మార్గుడి వలలో పడి, మూడోమాసం గర్భంతోవుంది. ఆమె వివాహం ఆలస్యమైతే పరిస్థితి ప్రమాదిస్తుంది. అందువల్ల నేను ఆ రాత్రి ఈ వూరు విడిచి వెళ్ళిపోయాను. లోకం నా గురించి చెడ్డగా అనుకుంటుం దని నాకు దిగులు లేదు. నా జీవిత ధ్యేయం వేరు. మొదటి నుంచీ నాకు రాముడి యందు విపరీతమైన భక్తి. ఐహిక వాంఛలతో నాకు నిమిత్తం లేదు. అనేక ప్రాంతాలు పర్యటించాను. అనేక మహనీయుల్ని సందర్శించాను. నాదోపాసనే నా జీవిత పరమావధి". అని ఆమె చెప్తూంటే నా శరీరం ఆశ్చర్యానందాలతో పులకరించింది. ''ఎంతటి మహనీయురాలవమ్మా! అందుకే నీ గానంలో అమృతం ప్రవహిస్తోంది" అన్నాను, ఆమె త్యాగాన్ని తల్చుకుంటూ.

ఆమె తంబుర మీటుతూ ''రామా నీ యెడ ప్రేమ రహితులకు, నీ నామ రుచి తెలియునా" అన్నపాట ఎత్తుకుంది.